సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి గంధం రాజేష్ కుమార్ దంపతులు (విజయవాడ) సోమవారం రూ.5 లక్షల విరాళం అందించారు.




ప్రతి రోజూ పంటగే

వ్యవసాయం అంటేనే పెట్టుబడి పెట్టిన కొన్ని నెలల తరువాత ఆదాయం వస్తుంది. అదే వ్యాపారమైతే పెట్టుబడి పెట్టిన నాటి నుంచి ఆదాయం వస్తుంది.

8 లో

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులకు చేరింది.

ధిక్కార స్వరం

- చంద్రబాబుపై స్వపక్షంలో పెరుగుతున్న అనమ్మతి
- నిడదవోలును జనసేన నేత కందుల దుర్గేష్‌కు కేటాయించడంపై టీడీపీ నేతల ఆగ్రహం
- ఇప్పటికే బూరుగుపల్లి శేషారావు ఇంటి వద్ద టీడీపీ శ్రేణుల సమాలోచనలు
- కందులకు టికెట్ ఇస్తే రాజీనామాలకు సిద్ధమని అల్టిమేటం
- బాబు వద్దకు పంచాయితీ
- మరోవైపు తనకే టికెట్ అంటూ టీడీపీ నేత కుందుల ధీమా
- నివురుగప్పిన నిప్పులా రాజకీయం



బూరుగుపల్లికి టికెట్ ఇవ్వాలని ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

సాక్షి, రాజమహేంద్రవరం/నిడదవోలు: టీడీపీ, జనసేన సీట్ల ప్రకటన రెండు పార్టీల్లోనూ ప్రకంపనలు రేపుతోంది. ఆయా పార్టీల అధినేతలు తీసుకున్న నిర్ణయం శ్రేణుల్లో ఆగ్రహావేశాలకు కారణమవుతోంది. ఏళ్ల తరబడి పార్టీకి సేవ చేసినా సరైన సమయంలో గుర్తింపు దక్కపోవడంతో అధినేతలపై రెండు పార్టీల నాయకులు గుర్రుగా ఉన్నారు. తమ నేతలకు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం దక్కకపోవడంతో వారి అనుచర గణాలు ధిక్కార స్వరం అందుకుంటున్నాయి. నిరసనలు, ఆవేదన జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఆశావహులైన నాయకులు, వారి అనుచరులు విమర్శల వాణిని బలంగా వినిపిస్తున్నారు. తమకు అన్యాయం జరిగిందని బహిరంగ ప్రకటనలకు దిగుతున్నారు. తమ నేతను కాదని ఇతరులకు పట్టం కడితే సహకరించబోమంటూ తెగేసి చెబుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

నిడదవోలులో కందుల దుర్గేష్‌కు సెగ

టీడీపీ – జనసేన పొత్తులో భాగంగా జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ నిడదవోలు నుంచి ఎన్నికల బరిలోకి దిగుతున్నారన్న ప్రచారం టీడీపీ నేతలకు మింగుడు పడటం లేదు. ఇక్కడి నుంచి ఆయన పోటీకి దిగితే ఎలా బుద్ధి చెప్పాలనే విషయమై పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు సోమవారం సమావేశమయ్యారు. టీడీపీ నిడదవోలు పట్టణ అధ్యక్షుడు కొమ్మున వెంకటేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గస్థాయి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా చర్చించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు సీటు దక్కపోతే చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై సమాలోచనలు చేశారు. శేషారావుకు టికెట్ ఇవ్వకపోతే మూకుమ్మడి రాజీనామాలకు సైతం వెనుకాడబోమని అల్టిమేటం జారీ చేశారు. ఈ విషయంలో పార్టీ అధిష్టానం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. బాబు నిర్ణయంపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాస్, పార్టీ ఉండ్రాజవరం మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణుడు దుమ్మెత్తి పోస్తున్నారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలూ కృషి చేసిన శేషారావు వంటి నేతకు సీటు ఇవ్వకపోతే సహించేది లేదని, చంద్రబాబు తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

బాబుతో తాడేపేడో!

నిడదవోలు స్థానంపై తాడోపేడో తేల్చుకునేందుకు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వర్గీయులు సిద్ధమవుతున్నారు. నేరుగా పార్టీ అధినేత చంద్రబాబు వద్ద పంచాయితీ పెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని ఉపన్యాసాలు ఇస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు నిడదవోలు టికెట్ విషయంలో పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై బాబు వద్ద వాదనకు దిగేందుకు సైతం వెనుకాడబోమని స్పష్టం చేస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన బూరుగుపల్లి శేషారావును కాదని జనసేనకు టికెట్ ఎలా ఇస్తారో అధిష్టానం వద్ద తేల్చుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఈ నెల 28న ప్రత్తిపాడులో జరిగే బహిరంగ సభలో చంద్రబాబుతోనే తేల్చుకునేందుకు నాయకులు సమాయత్తమవుతున్నారు. స్థానికులను పక్కన పెట్టి స్థానికేతరులకు పట్టం కట్టడంపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

కుందులకు అనారోగ్యం

నిడదవోలు నుంచి టీడీపీ టికెట్ ఆశిస్తున్న మరో నేత కుందుల సత్యనారాయణ తనకు ఈ టికెట్ దక్కదనే మనస్తాపంతో ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుకున్న పార్టీ నేతలు ఆయనను సోమవారం ఫోనులో పరామర్శించారు. టికెట్ దక్కలేదని బాధ పడాల్సిన అవసరం లేదని సముదాయించే ప్రయత్నం చేశారు. మాజీ ఎమ్మెల్యే శేషారావుకు తప్ప ఎవరికిచ్చినా.. కలసికట్టుగా పని చేద్దామని, మార్చి 1 నుంచి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని సత్యనారాయణ పార్టీ శ్రేణులతో ప్రస్తావించినట్లు తెలిసింది. నిడదవోలులో స్వపక్షంలోనే ఇద్దరు నేతల మధ్య వర్గ విభేదాలు నెలకొన్నాయని ఈ ఉదంతం చెప్పకనే చెబుతోంది.

రూరల్‌లో జనసేన నిరసన గళం

రాజమహేంద్రవరం రూరల్ స్థానంపై ఇరు పార్టీల అధినేతలూ దోబూచులాడటంతో టీడీపీతో పాటు స్వపక్షంపై జనసేన శ్రేణులు నిరసన గళం వినిపిస్తున్నాయి. జనసేన నేతలే ఏకంగా కందుల దుర్గేష్ ఇంటి వద్ద ఉన్న ఫ్లెక్సీలు చించివేశారంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై వారి ఆగ్రహం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. టీడీపీ సీనియర్ నేత, సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తన స్థానం నిలబెట్టుకునేందుకు నానా పాట్లూ పడాల్సిన పరిస్థితి తలెత్తింది. టీడీపీ ఆవిర్భావ సమయంలో జిల్లాలో కీలక భూమిక పోషించిన ఆయనకే ఆ పార్టీలో సరైన గౌరవం లభించడకపోవడం, పట్టుబట్టి మరీ తన స్థానాన్ని నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి రావడంపై బుచ్చయ్య వర్గీయులు సైతం స్వపక్షంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజానగరంలో రచ్చ

రాజానగరం నియోజకవర్గంలో జనసేన పోటీ చేస్తుందని జనసేన అధినేత పవన్ ప్రకటించారు. ఈ ప్రకటన టీడీపీ నేతల్లో ఆవేదన నింపింది. పార్టీ సోషల్ మీడియాకు రూ.కోట్లు ఖర్చు పెట్టిన టీడీపీ నేత బొడ్డు వెంకట రమణ చౌదరిని కాదని ఈ సీటును జనసేనకు కేటాయించడంపై ఆయన వర్గం కారాలు మిరియాలు నూరింది. ఒకానొక దశలో నేరుగా టీడీపీ అధినేతను ఢీకొట్టేందుకు అమరావతి వెళ్లారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయానికి 300 మంది కార్యకర్తలు వెళ్లి మరీ బొడ్డుకు మద్దతుగా నిలిచారు. పార్టీ నిర్ణయాన్ని ఎండగట్టారు. ఇలా స్వపక్షంలోనే నిరసన గళం వినిపిస్తూండటంతో టీడీపీ నేతల్లో ఆందోళన నెలకొంది. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే ఎన్నికల్లో తమ పరిస్థితేమిటని వారు ఆందోళన చెందుతున్నారు.



శేషారావుకు మద్దతుగా నిడదవోలు సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేతలు కొమ్మున వెంకటేశ్వరరావు తదితరులు

ప్రజల ముంగిటే ప్రభుత్వ సేవలు

- మంత్రి దాడిశెట్టి రాజా
- డి.పోలవరంలో సచివాలయం, ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభం



డి.పోలవరంలో సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రాజా

తుని రూరల్: మండల కేంద్రాల్లోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఇతర ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండా ఉండేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, నూతన సచివాలయ భవనాలు నిర్మించారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం డి.పోలవరంలో రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని రూ.62 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వతంత్రం వచ్చిన తర్వాత 2019 వరకూ రాష్ట్రం మొత్తంగా 4 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. ఇప్పుడు అదనంగా మరో 2.65 లక్షల మందికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. డ్వాక్రా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి చంద్రబాబు మోసం చేశారని, దీనికి భిన్నంగా ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ నాలుగు విడతల్లో డ్వాక్రా సంఘాల సభ్యుల మొత్తం రుణాన్ని మాఫీ చేసి, ఆ మొత్తాన్ని ఆ మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేశారని అన్నారు. అభివృద్ధి అంటే మీ బిడ్డలు ఉద్యోగాలు, ఉపాధి పొందడం, గ్రామాల్లో రోడ్లు, కాలువలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఇతర ప్రభుత్వ భవనాలు నిర్మించడమేనని, ఇవన్నీ కళ్ల ముందరే కనిపిస్తున్నాయని చెప్పారు. అవినీతి లేకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని, అభివృద్ధి కూడా చేస్తోందని అన్నారు. ఇవన్నీ ప్రతిపక్షాలకు, ఎల్లో మీడియాకు కనిపించడం లేదని దుయ్యబట్టారు. పేదలను, వృద్ధులను, అక్కచెల్లెమ్మలను, రైతులను, అన్ని వర్గాలను సీఎం జగన్ ఆదుకుంటున్నారని అన్నారు. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి, ప్రజలందరికీ మేలు చేస్తున్న సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో గతం కంటే రెట్టింపు మెజార్టీతో గెలిపించాలని మంత్రి రాజా కోరారు.

న్యూస్‌రీల్

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో పలు గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు. గజ్జరం (తాళ్లపూడి), బొబ్బిల్లంక-2 (సీతానగరం), కానవరం (రాజానగరం), పిడింగొయ్యి-4 (రాజమహేంద్రవరం రూరల్), వాడపల్లి-1 (కొవ్వూరు), కడియపులంక-1 (కడియం), సగ్గొండ (గోపాలపురం), అనపర్తి-1 (అనపర్తి) గ్రామ సచివాలయాల పరిధిలో ఈ వైద్య శిబిరాలు జరుగుతాయని వివరించారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శనగలకు రూ.5,440 మద్దతు ధర

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రబీలో రైతులు పండించిన శనగలను క్వింటాల్‌కు రూ.5,440 కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ నిర్ణయం మేరకు రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ఆధ్వర్యాన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి నిర్ణయించామన్నారు. రైతులు తమ పేర్లను మంగళవారం నుంచి ఆర్‌బీకేల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్‌బీకేల వద్ద శాంపిల్స్ పరిశీలన అనంతరం ఈ-క్రాప్ చేయించుకున్న రైతులను రిజిస్ట్రేషన్ చేస్తారని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ డి.ప్రతాప్ తెలిపారు. రైతులు తమ పంట శాంపిల్స్‌ను కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చి, శనగల నాణ్యతను సరిచూసుకొని, పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని, మద్దతు ధర పొందాలని సూచించారు. వివరాలకు ఆర్‌బీకేల వద్ద సంప్రదించాలని పేర్కొన్నారు.

నరసన్న హుండీల ఆదాయం రూ.41,23,882



హుండీల లెక్కింపు పర్యవేక్షిస్తున్న ఏసీలు నాగమల్లేశ్వరరావు, సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారికి వివిధ హుండీల ద్వారా భక్తుల నుంచి మొత్తం రూ.41,23,882 ఆదాయం వచ్చింది. సోమవారం దేవస్థానం కార్యాలయం వద్ద ఈ నెల 13వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ 14 రోజులుగాను నిర్వహించిన పై లెక్కింపులో స్వామికి ఈ ఆదాయం చేకూరింది. కోనసీమ జిల్లా ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో అమలాపురం ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. మెయిన్ హుండీల ద్వారా రూ.40,14,406, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.80,044, అన్నదాన హుండీ ద్వారా రూ.29,432 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. దేవస్థానానికి అనుబంధంగా ఉన్న నీలకంఠేశ్వర స్వామివారి ఆలయ హుండీ ద్వారా రూ.37,822 ఆదాయం వచ్చినట్టు చెప్పారు. హుండీలలో విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు. దేవస్థానం చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ఎంపీటీసీ సభ్యుడు బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, అర్చకులు, స్వామి సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి సన్నిధిలో న్యాయమూర్తి మల్లికార్జునరావు దంపతులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు దంపతులు సోమవారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ వేద పండితులు, ఆలయ పాలక మండలి చైర్మన్ గుత్తుల నాగబాబు, సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి మల్లికార్జునరావు దంపతులు స్వామికి విశేష పూజలు జరిపారు. మల్లికార్జునరావు దంపతులకు ఆలయ వేద పండితులు స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

కరెంట్ కరప్షన్‌పై విజిలెన్స్!

- రూ.1.50 కోట్ల కుంభకోణంపై విచారణకు ఆదేశం
- కలకలం రేపుతున్న 'సాక్షి' కథనం

సాక్షి ఇంపాక్ట్

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) స్టోర్స్ విభాగంలో అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు సన్నద్ధమవుతున్నారు. రూ.1.50 కోట్ల కుంభకోణంపై 'కరెంటాఫీసుకు అవినీతి షాక్' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన కథనం విద్యుత్ శాఖలో తీవ్ర కలకలం రేపింది. ఈ అక్రమ వ్యవహారంపై ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ స్పందించారు. రాజమహేంద్రవరం సర్కిల్, బొమ్మూరు స్టోర్స్‌లో ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడం ఏమిటని ఆయన ఉన్నతాధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. అక్రమాలు జరుగుతూంటే ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ అవినీతిని తీవ్రంగా పరిగణించిన సీఎండీ.. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి, అక్రమార్కుల గుట్టు రట్టు చేసేందుకు విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తుక్కు, విద్యుత్ సామగ్రి పక్కదారి పట్టిన వైనం, నిబంధనలకు విరుద్ధంగా లారీలు బయటకు వెళ్లిన వ్యవహారంపై సమగ్ర నివేదిక కోరినట్లు తెలిసింది. విచారణ సమగ్రంగా జరిగితే మరికొంత మంది దోపిడీ బహిర్గతమయ్యే అవకాశం ఉండటంతో విద్యుత్ శాఖ ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. ఈ విషయంలో ఓ ఉద్యోగిని సస్పెండ్ చేసినా వ్యవహారం బయటకు పొక్కకుండా ఆ శాఖ ఉన్నతాధికారులు తొక్కిపెట్టడంపై సైతం విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. స్టోర్స్ డిపార్ట్‌మెంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న రవాణా, ఏళ్ల తరబడి తిష్ట వేసిన ఉద్యోగి వివరాలు తమకు సమర్పించాలని సీఎండీ ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. విజిలెన్స్ విచారణ నివేదిక అనంతరం బాధ్యులపై చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఎలాంటి అక్రమాలూ లేవు

'సాక్షి' కథనంపై ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి స్పందించారు. స్టోర్స్ డిపార్ట్‌మెంట్ నుంచి సీసీ కెమెరాల నిఘాలో సామగ్రి బయటకు పంపుతామని చెప్పారు. ఇందులో ఎలాంటి అక్రమాలూ చోటు చేసుకోవని అన్నారు. ఈ-టెండర్ వేసిన తరువాత మాత్రమే తుక్కు బయటకు పంపుతామని తెలిపారు.

స్పందనకు 177 అర్జీలు

- సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ మాధవీలత ఆదేశం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై 177 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, డీఆర్ఓ జి.నరసింహులు అర్జీలు స్వీకరించారు. వీటిని నిర్ణీత కాల వ్యవధిలో నాణ్యతతో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు.

పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి, జిల్లాను పోలియో రహితంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. దీనికోసం వచ్చే నెల 3న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. పల్స్‌పోలియో నిర్వహణపై కలెక్టర్ స్పందన హాలులో జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలు 19,0479 మంది ఉన్నారని, వీరందరికీ పోలియో చుక్కల మందు వేసేందుకు 1,060 బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్ వంటి ప్రాంతాల్లో 60 ట్రాన్సిట్ టీములు, 47 మొబైల్ టీములు ఏర్పాటు చేశామని తెలిపారు. సంచార జాతులు, వలస జనాభా ఉన్న 465 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించామన్నారు. ఈ ప్రాంతాల్లో 2,694 మంది పిల్లలున్నట్లు గుర్తించామన్నారు. వీరికి మొబైల్ టీముల ద్వారా పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. సమావేశంలో జేసీ తేజ్‌భరత్, డీఆర్ఓ నర్సింహులు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు బాధ్యతగా పని చేయాలి

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ ఆ విధుల కోసం నియమించిన 16 మంది నోడల్, అనుబంధ అధికారులు సమన్వయంతో, బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. కలెక్టరేట్‌లో నోడల్, అనుబంధ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నోడల్ అధికారుల ప్రణాళికపై కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహించే సమీక్షకు సిద్ధంగా ఉండాలని అన్నారు. స్వీప్ కార్యకలాపాలపై ఇటీవల జరిగిన ఎన్నికల కమిషన్ సమావేశంలో జిల్లా నోడల్ టీమ్ చక్కటి ప్రజెంటేషన్ ఇచ్చిందని ప్రశంసించారు. మిగిలిన నోడల్ అధికారులు కూడా వారి బాధ్యతలు, విధులకు సంబంధించిన మార్గదర్శకాలు తెలుసుకుని, తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. నోడల్ అధికారుల విధులు, బాధ్యతలు, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను జేసీ తేజ్‌భరత్ వివరించారు. మార్గదర్శకాలను అతిక్రమిస్తే తీవ్రంగా పరిగణిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డీఆర్ఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ తదితరులు

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు మహర్దశ

- రూ.270 కోట్లతో ఆధునీకరణ
- వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రి వేణు, ఎంపీ భరత్

రాజమహేంద్రవరం సిటీ: దక్షిణ మధ్య రైల్వేలో ఎంతో ప్రాధాన్యం ఉన్న రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రాజమహేంద్రవరం సహా దేశవ్యాప్తంగా ఒకేసారి 554 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ నుంచి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, స్థానిక ఎంపీ మార్గాని భరత్‌రామ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ, ఒకేసారి 2 వేల రైల్వే స్టేషన్ల ఆధునీకరణ చేపట్టడం ప్రధాని మోదీ తీసుకున్న గొప్ప నిర్ణయమని కొనియాడారు. దీనికిగాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణానికి మెటీరియల్ అందించడంలో ఈ స్టేషన్ ప్రధాన భూమిక పోషించిందన్నారు. 172 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ రైల్వే స్టేషన్ అత్యంత పురాతనమైనదని చెప్పారు. ఇప్పటికే రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేశారని, గ్రీన్ టాయిలెట్లు ఏర్పాటు చేశారని అన్నారు. రూరల్ నియోజకవర్గానికి సంబంధించి కొన్ని మురికివాడల్లో మురుగు నీటిపారుదల సక్రమంగా లేదని, డ్రైన్లు దుర్గంధభరితంగా ఉన్నాయని, వాటి అభివృద్ధికి రైల్వే అధికారులు హామీ ఇచ్చారని అన్నారు.

ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రెండు మూడేళ్లుగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే ఉన్నతాధికారులకు వివిధ ప్రతిపాదనలు పంపానని, అనేకసార్లు రైల్వే మంత్రిని స్వయంగా కలిసి వివరించానని చెప్పారు. ఈ నేపథ్యంలో అమృత భారత్ స్టేషన్ పథకం కింద రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌ను రూ.270 కోట్లతో అభివృద్ధి చేయనున్నారని చెప్పారు. ప్రధాని మోదీకి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు భరత్ కృతజ్ఞతలు తెలిపారు. పునరాభివృద్ధి పనుల్లో భాగంగా అద్భుతమైన ఎలివేషన్‌తో అత్యంత అధునాతన సౌకర్యాలతో రైల్వే స్టేషన్ రూపురేఖలు సంపూర్ణంగా మారనున్నాయని చెప్పారు. ఫైవ్ స్టార్ స్థాయిలో ఆధునికతను సంతరించుకుని, ఇంటిగ్రేటెడ్ రైల్వే స్టేషన్‌గా మారబోతోందని అన్నారు. ఇప్పటికే ఈ స్టేషన్‌లో కొత్తగా 4, 5 ప్లాట్‌ఫాంలు వచ్చాయని, తూర్పు రైల్వే స్టేషన్ వైపు ఆరో నంబర్ ప్లాట్‌ఫాం రాబోతోందని భరత్ చెప్పారు. భవిష్యత్తులో వందేభారత్ వంటి అనేక వేగంగా నడిచే రైళ్లు రానున్నందున గోదావరి నదిపై మరో కొత్త వంతెనకు కేంద్రానికి ప్రతిపాదనలు అందించానని, ప్రస్తుతం ఇవి పరిశీలనలో ఉన్నాయని వివరించారు. అలాగే, కొవ్వూరు నుంచి భద్రాచలానికి కొత్త రైల్వే లైను ఏర్పాటు కానుందని, విశాఖ – విజయవాడ మధ్య మూడో లైన్ వేస్తున్నారని, పోర్ట్ లైన్ ఆవశ్యకత కూడా ఉందని అన్నారు. రైల్వే స్టేషన్ రోడ్డును విస్తరించాల్సి ఉందని, దీనికిగాను వీఎల్ పురం వద్ద ఉన్న 4,000 చదరపు గజాల స్థలాన్ని రైల్వేకు అప్పగించామని తెలిపారు. గోదావరి రైల్వే స్టేషన్ వద్ద రైల్వేకు మూడున్నర ఎకరాల స్థలం ఉందని, దానిని పార్కింగ్ నిమిత్తం ప్రతిపాదించామని చెప్పారు. మెయిన్ రోడ్డులో పార్కింగ్‌కు అసౌకర్యంగా ఉంటోందని, దానికి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు తెలిసిందని ఎంపీ భరత్ అన్నారు. వికసిత్ భారత్, వికసిత్ అమృత్ అంశంపై వ్యాచ రచన, డ్రాయింగ్, వ్యాయామ పోటీల్లో విజేతలైన చిన్నారులకు ఈ సందర్భంగా బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లను మంత్రి వేణు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం శ్రీనివాసరావు, మెమూ కార్ షెడ్ ఏడీఈ, ప్రోగ్రాం ఇన్‌చార్జి డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వేణు, ఎంపీ భరత్‌రామ్ తదితరులు

రేపు మెగా ప్రాంతీయ జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు, కాకినాడ జిల్లాల్లోని నిరుద్యోగుల కోసం రాజమహేంద్రవరం వీఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్ ప్రాంగణంలో బుధవారం మెగా ప్రాంతీయ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 150 కంపెనీలు పాల్గొంటున్నాయని, వీటిల్లో వివిధ ఉద్యోగాలకు ఫార్మసీ, బీటెక్, ఎంబీఏ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఐటీఐ, ఇంటర్, పదో తరగతి పూర్తి చేసిన 19 నుంచి 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులని వివరించారు. ఇంటర్వ్యూల ద్వారా ఆయా ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న అభ్యర్థులు ముందుగా వారి వివరాలను

https://tinyurl.com/ ZONEII& RegionalJobMela

వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, అనంతరం రెజ్యూమ్, ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో బుధవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కొండలరావు సూచించారు. వివరాలకు 96760 52454, 91339 12947 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

చెరువులోకి దూకి వృద్ధురాలి ఆత్మహత్య


సరోజ (ఫైల్)

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ చెరువులోకి దూకి వృద్ధురాలు కాళ్ళ సరోజ(73) ఆత్మహత్యకు పాల్పడింది. సర్పవరం పోలీసుల వివరాలు ప్రకారం సరోజ, ఆమె భర్త కాశీనాథ్ నాగమల్లి జంక్షన్ వద్ద డీసీసీబీ వెనక నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇద్దరు ఆడపిల్లలవ్వడంతో వారు వివాహాలు తరువాత ఇతర ప్రాంతాలలో ఉంటున్నారు. కాశీనాథ్ బ్యాంక్ ఉద్యోగిగా పనిచేశారు. వయసు రీత్యా అనారోగ్య సమస్యలు ఎక్కువ అవ్వడంతో ఆదివారం ఉదయం పది గంటలకు ఇంటి నుంచి బయటకు వచ్చిన సరోజ బోట్‌క్లబ్‌లో చెరువులో ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమ వారం ఉదయం మృతదేహం నీటితో తేలుతూ కనిపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్ట్‌మార్టంకు తరలించారు. సర్పవరం ఎస్సై పి.శ్రీనివాస్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి...

ముమ్మిడివరం: జీవితంపై విరక్తి చెందిన ఒక వృద్ధుడు మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ శివారు సోమిదేవరపాలెం పాటి మెరకకు చెందిన గంటి బాలయోగి (68) ఈ నెల 15న మద్యంలో పురుగు మందు కలుపుకొని సేవించగా అపస్మారక స్థితికి లోను కావడంతో బంధువులు అతనిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బాలయోగి భార్య పుణ్యవతి 10 ఏళ్ల క్రితం మృతి చెందింది. అతనికి ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఉండగా వారికి వివాహాలు జరిపించారు. ఈ మధ్యకాలంలో బాలయోగి మనో వేదనకు గురై ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈమేరకు ఎస్‌హెచ్‌ఓ భైరవ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి రోజూ పంటగే


ఏటీఎం పద్ధతిలో సాగు చేసిన వ్యవసాయ క్షేత్రం


పంటలను ప్రత్యేక స్టాల్‌లో విక్రయిస్తున్న రైతులు

- వినూత్న పంటల సాగుకు శ్రీకారం
- రోజు ఆదాయం వచ్చే విధంగా ప్రకృతి వ్యవసాయం
- ఆసక్తి చూపుతున్న రైతులకు ప్రత్యేక శిక్షణ
- సేంద్రియ పద్ధతిలో సేద్యం
- ఆరోగ్యకరమైన కూరగాయలు, పండ్ల ఉత్పత్తి

కాకినాడ జిల్లాలో సాగు ఇలా..

ప్రకృతి వ్యవసాయ రైతులు	10,675 మంది
భూములు	10,126 ఎకరాలు
ఏటీఎం పద్ధతిలో	365 మంది

కోనసీమ జిల్లాలో..

ప్రకృతి వ్యవసాయ రైతులు	4,620 మంది
భూములు	3,960 ఎకరాలు
ఏటీఎం పద్ధతిలో	320 మంది

పిఠాపురం: వ్యవసాయం అంటేనే పెట్టుబడి పెట్టిన కొన్ని నెలల తరువాత ఆదాయం వస్తుంది. అదే వ్యాపారమైతే పెట్టుబడి పెట్టిన నాటి నుంచి ఆదాయం వస్తుంది. అందుకే రైతు వ్యవసాయం చేయడం వల్ల ఆదాయం కోసం వేచి చూడాలి. తీరా చివరకు ఆదాయం వచ్చే సమయానికి ఏ ప్రకృతి వైపరీత్యమో వచ్చిందంటే ఆదాయం మాట అటుంచితే నష్టాలు చూడాల్సి వస్తుంది. వ్యవసాయం గాలిలో దీపంలా మారిపోతున్న నేపథ్యంలో పెట్టుబడి పెట్టిన తరువాత వెంటనే ఆదాయం వచ్చే విధంగా ఉంటే ఎంతో బాగుంటుంది. కాని అది వ్యవసాయంలో సాధ్యమవుతుందా అంటే సాధ్యమని నిరూపిస్తున్నారు రైతులు. ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు ఆసక్తి ఉన్న రైతులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రకృతి అందించే వనరుల ద్వారానే వ్యాపారంలా రాబడి వచ్చే పద్ధతి వైపు అడుగులు వేసి ఆ రైతులు విజయం సాధించారు. ప్రతీ రోజు ఆదాయం వచ్చే విధంగా సాగు చేపట్టారు. రోజూ ఆదాయంతో పాటు ఆరోగ్యకరమైన పంటలను ప్రజలకు అందించడంలో విజయం సాధించారు. సాధారణంగా పండించే పంటలతో పాటు కొంత భూమిని ప్రత్యేకంగా తయారు చేసుకుని విభిన్న పంటల సాగు ద్వారా కేవలం కొద్దిపాటి పెట్టుబడితో సాగు ప్రారంభించి దాని ద్వారా వచ్చే ఆదాయంతో మరిన్ని పంటలను సాగు చేయడం వల్ల అటు ఆదాయంతో పాటు ఇటు విభిన్న వ్యవసాయ ఉత్పత్తులను సాధిస్తున్నారు.

వ్యవసాయంలో రోజూ ఆదాయం ఇలా..

కొంత పొలం సిద్ధం చేసుకుని ముందుగా 15 రోజుల్లో అందుబాటులోకి వచ్చే ఆకు కూరలు నాటుతున్నారు. వాటితో పాటు నెల రోజుల్లో ఆదాయాన్నిచ్చే కూరగాయలు, పళ్లు, పువ్వులు, దుంపలు సాగు చేస్తున్నారు. నాట్లు వేసిన వారం రోజుల నుంచి ఇక రోజూ ఎంతో కొంత ఆదాయం ప్రారంభమవుతుంది. ముందుగా ఆకుకూరలు వారం రోజుల్లో అందుబాటులోకి వచ్చి వాటి ద్వారా ఆదాయం వస్తుంది. తరువాత రెండు నుంచి మూడు వారాలకు ఇతర పంటలు అందుబాటులోకి వచ్చి రోజూ కచ్చితంగా ఆదాయం వస్తుంది. ఆకుకూరలు తీసిన చోట మళ్లీ విత్తనాలను వేసుకుంటే ముందుగా వచ్చిన పంట తీసి అమ్ముకునే లోపు కొత్త పంట మళ్లీ అందుబాటులోకి వచ్చే విధంగా సాగు చేస్తున్నారు. ఇలా ఏకాలంలో అందుబాటులోకి వచ్చే రకాలను ఆకాలంలో వేస్తున్నారు. కేవలం కొన్ని సెంట్ల భూమిలో రూ.వేలల్లో ఆదాయం వచ్చే విధంగా అదీ రోజు ఆదాయం వచ్చే విధంగా చేయడమే ఎనీటైంమనీగా పిలుస్తున్నారు.

అధికారుల సహకారంతో సత్ఫలితాలు



నాపేరు గంధం సీతయ్య కాపు. నాది కొత్తపల్లి మండలం గోర్స. నేను వ్యవసాయం చేస్తున్నాను. నాకు వరి పొలం రెండు ఎకరాలు ఉంది. దీనిపై రెండు మూడు నెలలకు గాని ఆదాయం రాదు. అందువల్ల పెట్టుబడులు పెట్టి ఆదాయం కోసం పాటు పడాల్సి వచ్చేది. ఇంతలో ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు నా దగ్గరకు వచ్చి ఏటీఎం పద్ధతిలో కొంత భూమి సాగు చేయమని సూచించారు. దీంతో నేను నా పొలం వద్ద ఉన్న 20 సెంట్ల భూమిలో సుమారు 20 రకాల పండ్ల కూరగాయలు, దుంపలు వంటివి సాగు చేశాను. సాగు చేసిన కొన్ని రోజుల నుంచే నాకు ఆదాయం రావడం ప్రారంభించింది. ముందుగా వేసిన ఆకు కూరలు అందివచ్చి రోజూ కొంత ఆదాయం రావడంతో పాటు నిత్యం ఆదాయం వస్తోంది. ఆకు కూరలు పంట అయిపోతున్న తరుణంలో పండ్ల తోటలు, దుంపలు వంటి అందుబాటులోకి వచ్చి అవి కూడా ఆదాయం ఇస్తున్నాయి. ప్రతీ రోజు ఏదో ఒక పంట వల్ల ఆదాయం వస్తుండడంతో చిన్న చిన్న పెట్టుబడులకు సరిపోతున్నాయి. మా ఇంటికి కూరగాయలు, ఇతర పండ్లు వంటివి కొనుక్కోకుండా తీసుకుంటున్నాం. ఇది చాలా మంచి ఆదాయ వనరుగా అనిపించింది. ప్రతీ రైతు ఇలా చేస్తే బాగుంటుంది.

ప్రతి రోజూ ఆదాయం రావడం ఆనందం

నా పేరు ఎస్.ఈశ్వరుడు. మాది గొల్లప్రోలు మండలం దుర్గాడ. వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టడం చాలా రోజుల తరువాత ఆదాయం రావడం మామూలే. దాని వల్ల రైతుకు పెట్టుబడులకు వెచ్చించే డబ్బుకు వడ్డీల రూపంలో ఎక్కువ నష్టం వస్తుంది. కాని ప్రకృతి వ్యవసాయంలో కొత్త రకం విధానాన్ని అధికారులు మాకు పరిచయం చేశారు. వారు చెప్పినట్టు నేను ప్రయత్నించి చూశాను. నాకే ఆశ్చర్యం వేసేలా ఆదాయం వస్తోంది. అధికారులు నాకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

నేను నా పొలంలో అర ఎకరంలో సుమారు 20 రకాల పంటలు సాగు చేశాను. అవి కేవలం 15 రోజుల నుంచి ఆదాయం ఇవ్వడం ప్రారంభించాయి. సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం వల్ల సూపర్ మార్కెట్లు మా పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీంతో మంచి రేటు వచ్చి ఆదాయం బాగుంటోంది. ఏటీఎంలో డబ్బులు వచ్చినట్టు రోజు పంటలు చేతికి రావడం తద్వారా ఆదాయం రావడం నాలో మరింత ఉత్సాహాన్ని పెంచింది. మరి కొంత భూమిలో ఈ పద్ధతిలో సాగుకు ప్రయత్నిస్తున్నాను.

ఎనీ టైం మనీ మెషీన్లలా పంట పొలాలు



వ్యవసాయం అనేది అప్పుడప్పుడూ ఆదాయం ఇచ్చేది కాదు ఎప్పుడైనా ఆదాయం రాబట్టవచ్చు అనే విషయాన్ని రుజువు చేశాం. మోడ్రన్ సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించాం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఎలా రాబట్టాలి. సేంద్రి ఎరువులు, పురుగు మందుల తయారీ విధానాలపై శిక్షణ ఇస్తున్నాం. పొలాల్లో ఉండే మకాం దిబ్బలను, ఇళ్ల వద్ద గార్డెన్లను వీటికి ఉపయోగిస్తున్నాం. 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు భూమిని ఉపయోగించి సుమారు 20 నుంచి 40 రకాల పంటలను పండించి ఆదాయం పొందే విధంగా రైతులు కృషి చేస్తున్నారు. కొబ్బరి, ఆయిల్‌పామ్, మామిడి తదితర తోటలలోను అంతర పంటలుగా కూరగాయల సాగు చేపట్టారు. వరి పంట పొలాల్లో గట్ల పైనా మినుము, పెసర, చిక్కుడు వంటి పంటలు వేసి అదనపు ఆదాయం పొందుతున్నారు. పంట పండించిన రైతే స్వంతంగా అమ్ముకుంటుండడం వల్ల దళారులు లేకుండా నేరుగా వినియోగదారుడికి చేరుతుండడం వల్ల తక్కువ ధరలో నాణ్యమైన ఆరోగ్యవంతంమైన పంటలు ప్రజలకు అందుతున్నాయి. రైతు సాధికారిక సంస్థ ద్వారా రైతులు తమ పొలాలు, ఇళ్ల వద్దే అమ్మకాలు జరుపుతున్నారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి విక్రయాలు జరిపే ఏర్పాట్లు చేస్తున్నాం.

ఎలియాజర్, కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రకృతి వ్యవసాయ శాఖాధికారి, కాకినాడ

దారి దోపిడీ దొంగల అరెస్ట్

- పోలీసులకు చిక్కిన తొమ్మిది మంది, మరో ముగ్గురు పరారీ
- రూ.2.03 కోట్ల విలువైన 3.5 కేజీల బంగారు నగల రికవరీ
- రూ.15 లక్షల విలువైన రెండు కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జగదీష్


స్వాధీనం చేసుకున్న బంగారు నగలను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులమని బంగారం వ్యాపారిని బెదిరించి దారి దోపిడీకి పాల్పడిన కేసును తూర్పుగోదావరి జిల్లా పోలీసులు ఛేదించారు. 12 మంది దుండగులు దారి దోపిడీకి పాల్పడగా, వీరిలో 9మందిని అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. రూ.2.03కోట్ల విలువైన 3.5కేజీల బంగారు నగలను, రూ.15లక్షల విలువైన రెండుకార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ పి.జగదీష్ సోమవారం దిశాపోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 21వతేదీ సాయంత్రం 6.00గంటల సమయంలో జంగారెడ్డిగూడెం నుంచి భీమవరం వెళుతున్న బంగారు నగల వ్యాపారి కారును తమ ఇన్నోవాకారుతో ఐదుగురు ముద్దాయిలు అడ్డగించారు. వ్యాపారిని, అతని డ్రైవర్‌ను బెదిరించి తమ కారులో ఎక్కించుకున్నారు. బంగారు నగలతో ఉన్న వారి కారును వారిలో ఒక నిందితుడు నడుపుతుండగా, మరొక కారులో మిగిలిన నిందితులు వెంట వచ్చారు. రాజమహేంద్రవరం 4వ వంతెన జీరో పాయింట్ వద్ద వారి కారులోని సుమారు 3.5 కేజీల బంగారు నగలు, సుమారు రూ.5 లక్షల నగదును దొంగిలించి, వారిద్దరినీ, వారి కారును అక్కడ వదిలి పారిపోయారు. దీనిపై ఈ నెల 22వ తేదీన బాధితుడు నాథూరాం ఇచ్చిన రిపోర్ట్‌పై నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు, రాజమహేంద్రవరం నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసుల ఆధ్వర్యంలో, నల్లజర్ల ఇన్‌స్పెక్టర్ ఓ.దుర్గా ప్రసాద్, రాజమహేంద్రవరం క్రైం ఇన్‌స్పెక్టర్లు రజనీ కుమార్, విజయబాబు, ఉమామహేశ్వరరావు, దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరి, నల్లజర్ల ఎస్సై సురేష్, ఐటీ కోర్ ఎస్సై అయ్యప్పరెడ్డి, సిబ్బంది సహాయంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

నిందితులు విజయవాడ వైపు వస్తున్నారని తెలిసి సోమవారం నల్లజర్ల వద్ద రహదారిపై కాపుకాసిన పోలీసులు అరెస్ట్ చేశారు. జంగారెడ్డిగూడెంకు చెందిన చలపాక వెంకటేష్, వాటర్‌ప్లాంట్ నిర్వాహకుడు మద్దిపాటికళ్యాణ్, ఉల్లిపాయల వ్యాపారి కోడూరి రవితేజ, కారుడ్రైవర్ కోనా శ్రీనివాస్, వేముల మంజుబాబును, వారికి సహకరించిన కారు డ్రైవర్ షేక్‌నాగూర్‌మీరావల్లి, వేముల మోహన్ శ్రీనివాస్, మోహన్ నారాయణ్ కుంబాకర్, పమిడిపల్లి బ్రహ్మాజీలను అరెస్ట్ చేశారు. మొత్తం 181 బంగారు గొలుసులు, కరిగించిన బంగారం ముద్దలు మొత్తం సుమారు 3.5 కేజీల బంగారం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ జగదీష్ తెలిపారు. వీటివిలువ రూ.2.03 కోట్లు ఉంటుందన్నారు. ఈ కేసు లో ఇంకా ముగ్గురు పరారీలో వున్నారని, వారిని కుడా అరెస్టు చేస్తామన్నారు. కేసును అతి తక్కువ సమయంలో ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ జగదీష్ అభినందించి, అప్రిసియేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

బంగారం పనిలో నష్టపోవడంతో..

బంగారం పనిచేసే చలపాక వెంకటేష్ అప్పులు పాలుకావడంతో తన స్నేహితులతో కలిసి ప్లాన్ వేసి ఈ దారి దోపిడీకి పాల్పడ్డాడు. చివరకు పోలీసులకు చిక్కి అందరూ కటకటాల పాలయ్యారు.

సీఎం జగన్ సహకారంతో సాధ్యమైంది

- రూ.9.03 కోట్లతో కాకినాడ సూర్యారావుపేటలో విమాన మ్యూజియం
- ఎమ్మెల్యే కన్నబాబు


యుద్ధ విమానం లోపల ఎంపీ గీత, ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి, రాగిరెడ్డి దీప్తి, నేవీ కమాండెంట్ సుదీప్

కాకినాడ రూరల్: కాకినాడ జిల్లా ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు సూర్యారావుపేట బీచ్‌లో వినోద, విజ్ఞానం అందించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో యుద్ధ విమాన ప్రదర్శన శాల ఏర్పాటు చేయగలిగామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు రూ.9.03కోట్లతో సూర్యారావు బీచ్‌లో కౌడా థీమ్ పార్కులో ఏర్పాట చేసిన టీయూ - 142ఎం విమాన ప్రదర్శన శాలను సోమవారం కౌడా వీసీ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్ ఆధ్వర్యంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జేసీ ప్రవీణ్ ఆదిత్య చేతుల మీదుగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా తూర్పు నావికా దళ కమాండెంట్ ఎస్.సుదీప్ పాల్గొన్నారు. తొలుత యుద్ధ విమాన ప్రదర్శన శాల ప్రదర్శించిన అనంతరం విమానం లోపలకు వెళ్లి మ్యూజియంను పరిశీలించారు. ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు విమానం గురించి కమాండెంట్ సుదీప్ వివరించారు. తాను ఈ విమానానికి పైలట్‌గా పనిచేశానని, సుమారు 30 ఏళ్ల సర్వీసులో కార్గిల్‌తో మూడు యుద్ధాల్లో సేవలందించినట్టు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ తాను తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన 2009లో కాకినాడకు బీచ్‌ను అభివృద్ధి చేసి బీచ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారన్నారు. కేంద్ర మంత్రిగా చిరంజీవి ఉన్నప్పుడు బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేశామన్నారు. శిల్పారామం తీసుకువచ్చామన్నారు. 2019లో సీఎంగా జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత కాకినాడ బీచ్‌లో యుద్ధ విమానం మ్యూజియం ఆలోచన చేశామన్నారు. కాకినాడ, వైజాగ్, కోల్‌కతాలో మాత్రమే యుద్ధ విమాన ప్రదర్శన శాలలు ఉన్నాయన్నారు. ఈ మ్యూజియం త్రివిధ దళాలలో చేరాలనుకునే వారికి ప్రయోజనంగా ఉంటుందన్నారు. కాకినాడ బీచ్‌లో కౌడా థీమ్ పార్కు, విమాన ప్రదర్శన శాలతో పాటు ఈట్ స్ట్రీట్ ఏర్పాటు, చిల్డ్రన్ పార్కు, తదితర వాటిని రూ.14.5 కోట్లతో ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

ఎంపీ వంగా గీత మాట్లాడుతూ టీయూ - 142ఎం యుద్ధ విమానం దేశంలో అత్యంత బరువైనది, అత్యంత వేగమైనదన్నారు. మూడు యుద్ధాల్లో పాల్గొందన్నారు. దేశంలో ఇటువంటివి మూడు ఉండగా కాకినాడకు ఒకటి రావడం చాలా అదృష్టమన్నారు. కౌడా రూ.5.5 కోట్ల వ్యయం చేసిందన్నారు. ఎన్‌సీసీ అకాడమీ, అంఫీబియస్ కాలేజీని కాకినాడకు తీసుకురావడం తన లక్ష్యమన్నారు. కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్ మాట్లాడుతూ సీఆర్‌జెడ్ సమస్య వలన ప్రారంభోత్సవంలో జాప్యం జరిగిందన్నారు. కౌడా వీసీ పి.కృష్ణమూర్తి, సెక్రటరీ కాళీబాబు, పీఓ శ్రీనివాసరావు, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, మాజీ కార్పొరేటరు రాగిరెడ్డి బన్నీ, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, సర్పంచ్ సూరాడ చిన్నీ, రాగిరెడ్డి కన్నా, , ఏఎంసీ ఛైర్మన్లు గీసాల శ్రీను, పసుపులేటి వెంకటలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టరు గగారిన్ పాల్గొన్నారు.

నేడు నిధి ఆప్ కే నికట్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో మంగళవారం నిధి ఆప్ కే నికట్-డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ వైడి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో వేమగిరిలోని శ్రీసర్వారాయ సుగర్స్ లిమిటెడ్ బాట్లింగ్ యూనిట్‌లోను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం కిమ్స్ హాస్పిటల్‌లోను, కాకినాడ జిల్లాలో చెందుర్తిలోని ఎలైట్‌నేచురల్ ఆయిల్స్ అండ్ ఫ్యూయెల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లోను, ఏలూరు జిల్లాలో తాడేపల్లిగూడెంలోని 3ఎఫ్ ఇండస్ట్రీస్‌లోను, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో డాక్టర్ ఎస్ఎస్ డిగ్రీఅండ్ పీజీ కాలేజీలోను, అల్లూరిసీతారామరాజు జిల్లాలో వై.రామవరం మండలం చవిటిదిబ్బలు కేజీబీవీలోను, గంగవరం మండలంలో పిడతమామిడి పీహెచ్‌సీలోను, మారేడుమిల్లి పీపీసీసీఎస్‌లోను జరుగుతుందన్నారు. కవరేజ్ సర్టిఫికెట్, క్లెయిమ్‌ల దాఖలు, అంతర్జాతీయ కార్మికుల ప్రాథమిక అంశాలపైన, ఎస్ఎస్ఏ అంటే ఏమిటి, దాని ప్రయోజనాల గురించి వివరిస్తారన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్‌లు, కొత్తగా కవర్ అయిన ఎస్టాబ్లిష్మెంట్‌లు ఈ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. పింఛనుదారులు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించవచ్చని తెలిపారు.

స్ట్రాంగ్ మెన్‌గా బాలకృష్ణ... వుమెన్‌గా శ్రియ

ముగిసిన గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు


స్ట్రాంగ్ మెన్ టైటిల్ విన్నర్ బాలకృష్ణ


స్ట్రాంగ్ వుమెన్ టైటిల్ విన్నర్ శ్రియ

అమలాపురం టౌన్: స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యాన వనంలో ఆదివారం ఉదయం ఆరంభమైన ఉభయ గోదావరి జిల్లాల స్థాయి పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ వుమెన్ -2024 పోటీలు అదే రోజు అర్ధరాత్రితో ముగిశాయి. పోటీల్లో స్ట్రాంగ్ మెన్ విన్నర్ టైటిల్‌ను రాజమహేంద్రవరం క్రీడాకారుడు ఎ.బాలకృష్ణ, స్ట్రాంగ్ మెన్ రన్నర్ టైటిల్‌ను అమలాపురం క్రీడాకారుడు ఎం.వీరేంద్ర గెలుచుకున్నారు. వుమెన్ విభాగంలో స్ట్రాంగ్ వుమెన్ విన్నర్ టైటిల్‌ను తణుకు క్రీడాకారిణి ఎం.శ్రియ, రన్నర్ స్ట్రాంగ్ వుమెన్ టైటిల్‌ను అమలాపురం క్రీడాకారిణి పి.వందన కైవసం చేసుకున్నారు. ఈ వివరాలను అమలాపురం హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. మెన్ విభాగంలో 59 కేజీల విభాగంలో బి.యశ్వంత్ (అమలాపురం), వై.రాజు (రాజమహేంద్రవరం), ఎం.కిరణ్ (రాజమహేంద్రవరం), 66 కేజీల విభాగంలో ఎం.మధుమోహన్ (రాజమహేంద్రవరం), వ.లవకుమార్ (ముమ్మిడివరం), వై.పుత్రరాజు (రామచంద్రపురం), 74 కేజీల విభాగంలో ఎ.బాలకృష్ణ (రాజమహేంద్రవరం), పి.జోసెఫ్ (రామచంద్రపురం), వి.మహేష్ (ముమ్మిడివరం), 83 కేజీల విభాగంలో ఎంసాయి (ముమ్మిడివరం), ఎం.రాహుల్‌బాబు (అమలాపురం), ఎం.వెంకటేష్ (అమలాపురం), 93 కేజీల విభాగంలో ఎం.వీరేంద్ర (అమలాపురం), ఎస్.సాయిభవాని (అమలాపురం), పి.మోహన్ (ముమ్మిడివరం), +93 కేజీల విభాగంలో వి.వంశీ (ముమ్మిడివరం), పీహెచ్ వెంకటేష్ (రాజమహేంద్రవరం), డి.వీర మణికంఠ (ముమ్మిడివరం).లు వరసగా మొదటి మూడు స్థానాలు గెలుచుకున్నారు. విజేతలకు బహుమతులు సమకూర్చిన డాక్టర్ గంధం విశ్వనాథం, గంగుమళ్ల కాసుబాబు, గంధం పల్లంరాజు పతకాలు, షీల్డ్‌లు, ట్రోఫీలు అందజేశారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలను అమలాపురం మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగ దుర్గ, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు దంపతులు నిర్వహించారు.

వైభవంగా భీమనాథుని శ్రీ పుష్పోత్సవం


పుష్పోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు


పుష్పోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీ పుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మూర్తులైన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్లకు ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య శాస్త్రోక్తంగా శ్రీ పుష్పోత్సవం నిర్వహించారు. పుణ్య దంపతులకు తాంబూలాలు అందజేశారు.